**సి.పి.బ్రౌన్ అకాడమీ**
**నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో**
**విశేష బహుమతి**
**రూ. 2,000 పొందిన కథ**



**''అన్నా! నువ్వే దిక్కు!'' అని కాళ్ళమీద పడిపోయాడు వెంకటరమణ.**
**''ఛ! ఛ! ఏందిరా ఇది! లే, లే'' అన్నాడు బ్యూరో ఛీఫ్ నారాయణ.**
**''నువ్వు ఆదుకుంటానంటేనే నేను నీ కాళ్ళనొదుల్తా'' అని అల్టిమేటం జారీ చేశాడు వెంకటరమణ.**
**''అట్లనే, ముందు నువ్వు లేచి ఏడువు''**
**లేచి, కుర్చీలో కూర్చున్నాక, ''ఏందన్నా, నువ్వు పాడుతుంటవు, ఆ కీర్తనేందీ? శాంతము... శాంతమూ లేక..''**
**''శాంతమూ లేక సౌఖ్యమూ లేదు... అది త్యాగరాజు కీర్తనరా...''**
**''నా పరిస్థితి అట్లనే అయిందన్నా! మనశ్శాంతి లేకుండా ఎట్ల నౌకరీ చేయాల్నే?''**

ఇద్దరిదీ ఒకే ఊరు, ఒకే కులం. నారాయణే వెంకటరమణకు ఆ టివిఛానల్‌లో ఉద్యోగమిప్పించాడు. 'అనునిత్యం ప్రజాసేవలో మీ ప్రజా టివి' ఐదారేళ్ళ క్రితం ప్రారంభమయింది. 2009 ఎన్నికల్లో హోరెత్తించే కవరేజీతో రేటింగ్స్ పెంచుకుంది. ఓ పెద్ద పత్రికలో సీనియర్ జర్నలిస్టుగా ఉన్న నారాయణ ఇన్‌పుట్ ఎడిటర్ (బ్యూరో ఛీఫ్)గా నియమితుడయ్యాడు. రిక్రూట్‌మెంట్ జరిగేటప్పుడు వెంకటరమణ తండ్రి వచ్చి నారాయణను ప్రాధేయపడితే, ఊరివాడు, కులం వాడన్న అభిమానంతో, అతని నైజం కొంతవరకు తెలిసినా, తులసివనంలో ఒక్క గంజాయి మొక్క ఉన్నా ఫర్లేదనుకుంటూ, వెంకటరమణ కంపోజిటర్ ఉద్యోగమిప్పించాడు, రిపోర్టరు ఉద్యోగానికి పనికి రాడని. టివిలోని మిగతా అధికార్లకు అతని పనితీరు అంతగా నచ్చక పోయినా అతన్ని కాపాడుకుంటూ వస్తున్నాడు నారాయణ. స్క్రోలింగ్‌లో అక్షరాలు తప్పుగా టైప్ చేస్తుంటాడు. ఒకోసారి, అక్షరానికి బదులు స్క్వేర్‌లూ, ట్రయాంగిల్సూ వస్తుంటాయి. ఒకసారి అవుట్‌పుట్ ఎడిటర్ బలవంతరావు ''ఏందండీ! మీ వాడు ఇట్లా చేస్తున్నాడ''ని తనకు కంప్లయింట్ చేస్తే తను వెంకటరమణను మందలించాడు కూడ.

''తెలుగొట్టి దరిద్రాబ్బాసన్నా! వత్తులంట, నీకు తెల్సునా అన్నా, అని దిగ్గొట్టే మేకులసుంటివి. ఆటితో నా పాణం పోతావుందనుకో! ఎక్కడ మేకు దిగ్గొట్టాలో తెలవదు, ఎక్కడ వద్దో తెలవదు. పెద్ద కంప్లయింట్ చెయ్యటానికొచ్చాడు. మొన్న 'బాధ', 'భేదము' అన్నాడు, 'భాద', 'బేధము' కదా! గురివింద! ఎవర్నయినా తప్పు పట్టే ముందు మనం సరిగ్గున్నామో లేదో తెల్సుకొనాలి'' అన్నాడు వెంకటరమణ?

ఇంక అతనికి నచ్చచెప్పటం తనవల్లకాదని ఊరుకోక తప్పలేదు నారాయణకు.

లేకపోతే ''నీకు సరిగ్గా తెలుగొచ్చునా, అన్నా!'' అనికూడ అనగలడు.

ఇంక ప్రస్తుతానికి వస్తూ, ''ఏమయిందో చెప్పరా'' అన్నాడు నారాయణ విసుక్కుంటూ, అతన్ని వదిలించుకునే ప్రయత్నంలో.

''నా పెళ్ళాన్కి నౌకరీ కావల్నంట! 'నువ్వేగాడిద కాళ్ళయినా పట్టుకో. నాకు పని కావాలి' అని మొండికేసింది. నే నంటి, 'అట్లనే! మా టివిల నీలాంటోళ్ళు పనికొస్తరు. మన నారాయణన్న కాళ్ళు పట్టుకుంటే ఏ పనయినా అయిపోతది' అని నేను నీ తరపున భరోసా ఇచ్చినా. పాలముంచినా, నీటముంచినా నీదే బారమన్నా!''

ఆ మాటల్తో నారాయణకు మండిపోయింది. ''ఏందిరా, కాళ్ళు పట్టుకుంటే నేనే పనయినా చేస్తానా? నేను గాడిదనా? చంపుతా నా కొడకా! అడ్డమైనోడూ కాళ్ళు పట్టుకోటానికి నా కాళ్ళంత చీప్‌గా ఉన్నయ్, బే ! లే, అందరూ నీమీద కంప్లయింటు చేస్తున్నారు. 'పోన్లే, మనూరోడు గదా' అని చూసీ చూడకుండా పోనిస్తున్నా. నీ కేసు శ్రుతిమించి రాగాన పడినాది. నువ్విక్కడింక పనికి రావు. నిన్ను ఊస్టు చేస్తున్నాను, వెళ్ళు'' అని కసిరాడు. అయితే వెంకటరమణేం బెదరి పోలేదు. ''అన్నా!'' అని పెద్దగా అరుస్తూ నారాయణ కాళ్ళపై పడిపోయాడు.


''చంపుతా వెధవ! లే ముందు...''

''నా పెండ్లానికి నౌకరీ ఇస్తానంటేనే లేస్తా..''

విసుగొచ్చేసింది నారాయణకు.

# మనోడు

**కాకాని చక్రపాణి**



''అట్లనే ఇస్తనురా, నిన్ను మళ్ళా నౌకరీలో పెట్టు కోమని మాత్రం అడక్క'' అన్నాడు.

''పట్నం బతుకుడు కష్టమయినాది. దానికి హయ్యర్ స్టార్ట్‌లో మొదలెట్టరాదె.''

''చూస్తాలేరా, ఏదయినా చేస్తా, నీ నౌకరీ తప్ప.''

''నాకు ఎక్రెడిషన్ కార్డు ఇప్పించు. అప్పటి సందికే అడిగినా. 'గుమాస్తా నా కొడుక్కు నీకు ఎక్రెడిషనెట్లిస్తార్రా' అంటివి. మా ఊరు వారం, వారం ఎళ్ళాల్సి వస్తుండె. రాకుంటే మా నాయన ఊర్కోడు. మస్తు పైసలుకర్సవుతుండె. ఎన్ని సార్లడిగినా నువ్వు పట్టించుకోకుంటివి...''

వెంకటరమణ కాళ్ళట్టుకుంటే కంపరంగా ఉంది. నారాయణకు. ఎలుగ్గొడ్డు కాళ్ళట్టుకుంటే అలాగే వుంటుంది ఎవరికయినా. అది తప్పించు కోటానికి ఏదయినా ఇచ్చే సేట్టున్నాడు.

''అట్లనేరా, నౌకరీ మాత్రం అడక్క.''

''నాకు ప్రమోషన్ ఇవ్వలేదు, రెండేళ్ళసందీ. జీతం పెంచు.''

బుర్ర పోయింది నారాయణకు. ''అట్లనే రిక మెండు చేస్తా, నా కాళ్ళోదులు'' అన్నాడు.

''ఇంక వదిలేదేందన్నా! పప్పులో కాలేసినావు. నా నౌకరీ ఉంటేగా నువ్వు నాకు ఎక్రెడిషన్ కార్డు ఇచ్చినా జీతం పెంచినా? మాటతపొద్దు. మనూరోళ్లెవరూ మాట తప్పినోళ్ళుకాదు. నువ్వు మాట తప్ప నంటేనే నేన్నికాళ్ళొదిలేది.''

ఇంక విసుగొచ్చేసింది నారాయణకు. ''అట్లనే, పోరా, వెధవా!'' అన్నాడు.

వెంటనే లేచి, ''నా పెండ్లామును బయట నిల బెట్టి వచ్చా. తీసుకొస్తా. నువ్వు నౌకరీ ఇవ్వక పోతే అది నా ప్రాణం కొరికేస్తది, పందికొక్కులాగ'' అనేసి బయటి కెళ్ళి రెండు క్షణాల్లో ఆమెని పట్టుకొచ్చాడు.

ఆమెను నఖశిఖ పర్యంతం పరీక్షించాక, ''నీ పేరేంది?'' అని అడిగాడు నారాయణ.

''బస్తా తలోదరి'' అంది ఆమె.

''నీ మొగుడి పేరు నడిమింటి వెంకటరమణ కాదూ?'' అని ఆశ్చర్యపోతూ అడిగాడు నారాయణ.

''అయితే, అతనింటి పేరు నేనెందుకు పెట్టుకోవాలి? పుట్టిన సంది నుండి వస్తున్న ఇంటిపేరు మార్చుకోవల్నా? పురుష దురహంకారానికి నేను తలొగ్గను....'' అంది ఆమె.

ఆమె మాటలు విన్న ఒకప్పటి కమ్యూనిష్టుకు ముచ్చటేసింది. ఆమెకో ట్రయలు ఇచ్చి చూద్దాం అన్పించింది నారాయణకు.

''నీకు నౌకరీ ఇచ్చేశానని మురిసిపోక. నీ ఈ అప్పాయింట్‌మెంట్ ప్యూర్‌లీ ఆన్ టెంపరరీ బేసిస్. నీ పెర్‌ఫార్మెన్స్‌మీద నీ నౌకరి ఆధారపడి ఉంది. రిక మెండేషన్లకు యీల్డయ్యే మనిషిని కాదు నేను. ఎలా న్యూస్ కవరేజ్ చెయ్యాలో మిగతావాళ్ళు చూపిస్తారు. నేర్చుకో. తెలియని విషయాలు సీనియర్ల నడిగీ, ఇంటర్నెట్లో, వెబ్‌సైట్లో చూసీ, తెలుసుకో. నౌకరీ ఇచ్చినందుకు నా పేరు నిలబెట్టాలి....'' అని ఆ భార్యాభర్తల్ని వదిలించుకున్నాడు ఇన్‌పుట్ ఎడిటర్ నారాయణ.

ఆమె చేసిన రెండుమూడు న్యూస్ కవరేజీలు

చూశాక నారాయణ ఊపిరి పీల్చుకున్నాడు. 'ఫర్లేదు. ఓ ఆర్నెళ్ళల్లో మంచి రిపోర్టరు అవుతుందన్న భరోసా అతనికి కలిగింది. కానీ ఆ నమ్మకం ఆ తర్వాత సడలిపోయింది. ఒకసారి ఆమె చేసిన న్యూస్ కవరేజీ చూసి అతనికి డోకొచ్చింది.

ఆ కథాకమామిషు ఏమిటో తెలుసుకుంటే ఆమె సామర్థ్యం, ప్రతిభా పాటవాలు ఎలాంటివో మీకూ అర్థమవుతాయి. ఓసారి తలోదరీ, వెంకటరమణా డ్యూటీకి వెళ్తూంటే, మోటర్ బైక్‌పై దూసుకొచ్చిన ఓ యువకుడు దారిన పోతున్న ఓ గాడిదను ఢీకొట్టి, తుర్రుమని దూసుకుపోయాడు. జరిగిన సంఘటననేం పట్టించుకోకుండా స్కూటర్ని పోనిస్తున్న భర్త భుజంపై ఓ చరుపు చరిచి బండిని ఆపమంది తలోదరి. గాడిదకాలు విరిగినట్లుంది. అది బాధతో ఓండ్ర పెడుతోంది. వెంటనే ప్రజాటివి ఆఫీసుకు ఫోను చేసింది తలోదరి. పావుగంటలో కెమేరామన్ కవరేజీకి సిద్ధమయాడు. చుట్టూ జనం జమ్మెయ్యారు.

ప్రజా టివి ఆంకరు ''రామ్‌నగర్ ఏరియాలో ఏదో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అక్కడి విషయాలను మా రిపోర్టరు తలోదరి మనకందిస్తారు. తలోదరీ! ఏం జరిగిందో చెప్పండి'' అన్నాడు.

కెమేరా తలోదరి వైపుకు తిరిగింది. ఒకటి రెండు క్షణాలు దిక్కులు చూసిన తలోదరి మైకు పట్టుకుని రిపోర్టింగ్ మొదలెట్టింది.

''బాలాజీ! ఈ మోతుబరి మోటరుసైకిళ్ళవారి దౌర్జన్యానికి అంతులేకుండా పోతున్నది. ఇవ్వాళ ఆఘాతుకానికి ఓ అమాయకజీవి, ఓ గార్ధభ మిత్రుడు బలి అయ్యాడు. నేను చూస్తూ ఉండగానే ఆ మోటరు సైకిలిస్టు దౌష్ట్యానికి తన మానాన తల వంచుకుని వెళ్ళిపోతున్న ఓ బడుగుజీవి కాలువిరిగి గాయాల పాలయింది. ఇప్పుడు ఏం జరిగిందోమన చుట్టుపక్కలనున్నవారినడిగి తెలుసుకుందాం'' అని హాండ్ మైకును ఓ స్త్రీ ముందుంచి ''మీరు చెప్పండి ఏం జరిగిందో'' అంది.

''ఏం చెప్పేదితల్లీ! మనుషులపైనే బండ్లెక్కించేసి పోతుంటే గాడిద సంగతేం చెప్పగలం?!'' అంది ఆమె.

''అమ్మమ్మ! గాడిదలని వాటిని చిన్నచూపు చూడకండి. ఈ భూ ప్రపంచంలో బతికేందుకు మనుషులకెంత హక్కుందో అంత హక్కు వాటికీ ఉంది'' అంది తలోదరి. తనకు కావల్సిన స్పందన ఆమె నుండి రాదని తెలుసుకున్న ఆమె మరో వ్యక్తికి మైకు అందిస్తూ, ''మీకు తెలిసింది చెప్పండి'' అంది.

అతను యువకుడు. ''ఈ పట్నంలో గాడిదల బెడద ఎక్కువయింది. ఎక్కడబడితే అక్కడ అవి దర్శనమిస్తున్నాయి. గాడిదల నదుపు చెయ్యటానికి ప్రభుత్వమే చర్యలూ చేపట్టటం లేదు. తప్పంతా ప్రభుత్వానిది'' అని వెళ్ళిపోయాడతను.

అప్పుడు కెమేరామన్‌కి సైగ చేసింది తలోదరి. అతను కెమేరాను వెంకటరమణ వైపు ఫోకస్ చేశాడు.

''మీరు కూడా చూసే వుంటారు, ఈ దుర్ఘటనను. మీరేమంటారు?'' అంది తలోదరి.

''ఇంత దౌర్భాగ్యం ఇండియా హోల్ మొత్తం మీద మరే సిటిలోనూ జరగదు. మనది ఎట్టాంటి నగరం. ఇది ఒకప్పుడు చాళుక్య రాజులు ఏలిన పట్నం. వాళ్ళు ఎంతో దయామయులు, గాడిదల కోసం రాజవీధుల ప్రక్కన మంచి నీటి తొట్టెలు నిర్మింప చేసినారు. గాడిదలకు ప్రత్యేక దవాఖానాలు ఉండేవి. మీరడగవచ్చు గాడిదలకు మిగతా జంతువుల కంటే ఆ ప్రత్యేకత ఏమిటి అని. వుంది. ఆ వంశమూల పురుషుడెవడో ఎప్పుడు ఓ గొప్ప కార్యం తలపెట్టినా, ఓ గాడిద కూత వినపడేదంట! ఆయన తల పెట్టిన కార్యం విజయవంతమయ్యేదంట! అప్పటినుండి ఆళ్ళకు గాడిదల మీద ప్రత్యేక అభిమానం ఏర్పడినాది. అట్టాంటి నగరం ఇవాళ వాటి పట్ల ఇంత చిన్న చూపు ప్రదర్శించటం క్షంతవ్యం కాదు. అది అలా ప్రాణాంతకమయిన గాయం తగిలి బోరుబోరున ఓండ్ర పెట్టి విలపిస్తుంటే సహిస్తున్న మీ హృదయాలు గుండెలా, బండరాళ్ళా? అని నేను ప్రశ్నిస్తున్నాను....''



అలా బల్లగుద్ది వాదిస్తుంటే, వెంకటరమణ ప్రక్కనున్న మరో వ్యక్తి, ''మరి మీరెందుకు దాన్ని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్ళరూ?'' అని సూటిగా ప్రశ్నించాడు.

వెంకటరమణ తెల్లముఖం వేస్తే, అప్పుడు తలోదరి అతని రెస్క్యూకు వచ్చింది.

''ఇలాంటి విషయాల్లో ప్రజా టివి ఎప్పుడూ ముందుంటుంది. మా రెస్క్యూవాను వచ్చి ఈ నిర్భాగ్యజీవులకు అందించాల్సిన సేవలందిస్తుంది. మేం ఈ దుర్ఘటనను చూసిన వెంటనే ఫోను చేశాం. రెస్క్యూవాను వస్తోంది.. ఇలాంటి విషయాలలో మా ప్రజా టివినే ముందుంటుంది. అందుకే అది ఎంతో ప్రజాభిమానానికి గురయింది...''

అంతలో గాడిద బాధ భరించలేక పెద్దగా ఓండ్ర పెట్టింది.

''మీరు నా మాటలు పూర్తిగా వినలేదు. గాడిద సంతు రోజురోజుకు తగ్గిపోతున్నది. గార్ధభ జనాభా పరిరక్షణకై ప్రభుత్వం ఏ చర్యా చేపట్టక పోవటం విచారకరం. నేను ఒక ఉద్యమం ప్రారంభించబోతున్నాను. అందువల్ల గాడిద జనాభా పెరిగి మన నగరం కొత్త శోభను పెంచుకుంటుంది..'' అన్నాడు వెంకటరమణ.

'అధికం పోతున్నావు, మగడా!' అందామని నోటిదాకా వచ్చి కూడ, వీలుకాక, దిగమింగి, ''ఏమిటది?'' అని అడిగింది తలోదరి.

''ప్రతి ఇంట్లోనూ ఓ గాడిదను పెంచుకోవాలని ఉద్యమిస్తాను, శాసన సభ అందుకు ఒక చట్టం తీసుకు వస్తుంది. నగర జనమంతా గాడిద కేకలకు సంతసిస్తూ నిద్రలేస్తారు, అది శుభసూచకం కనుక!''

''ఓర్నీ ఏం ఆలోచనలు రా నాయనా! మాటలు ఆపి ముందు గాడిద సంగతి చూడు! జీవాల పట్ల కరుణ కలిగి ఉండాలి...'' అన్నాడు ఇంతకుముందు గాడిదను ఆసుపత్రికి తీసుకువెళ్ళమన్న వ్యక్తి.

''అంత కరుణ వుంటే, నువ్వా ప్రయత్నం చెయ్యరాదుటయ్యా? నేనేం బ్లూక్రాసు మనిషిని కాదు. రెస్క్యూవాను వస్తోందని చెప్పిందికదా ఆమె. మనకు మేలు జరగాలంటే, మన పక్కింట్లో

సుభాసుచంద్ర బోసు పుట్టాలన్నాట్ట నీబోటివాడె వడో! ఇక్కడ గాడిద బాధ పట్ల స్పందించని రాతి గుండె కలవాడెవడూ లేడు...''

''మరే... మనది కాకపోతే కాశీదాకా దేకమన్నా డట!'' అన్నాడు మరో వ్యక్తి అందులో తల దూరుస్తూ.

''నోర్మూసుకోండయ్యా! నేను ఆమెతో మాట్లా డానుగానీ మీతో గాదు. మధ్యలో మీకెందుకు దురద....!''

''నన్నేనా అంత మాటన్నది....!''

కారుమేఘాలు కమ్ముకుంటున్న వాతావరణం చూసిన టివి స్టూడియో ఆంకర్‌వైపు కెమేరా మర ల్చింది.

''తలోదరీ! తరవాతి భోగట్టాకోసం మిమ్మల్ని మళ్ళా కాంటాక్ట్ చేయటం జరుగుతుంది. మీరక్కడే ఉండండి...'' అని, ''గాడిద ఏక్సిడెంటు గురించి మరింత సమాచారం తెల్సుకోబోయే ముందు మనమో చిన్న విరామం తీసుకుందాం. ప్రజాటివికే అంటి పెట్టుకుని ఉండండి...'' అన్నాడు ఆంకర్.

ఓ పావు గంట సేపు అడ్వర్‌టైజుమెంట్లతో హోరెత్తించాక, మళ్ళీ ఆంకర్ దర్శనమిచ్చాడు.

''జరిగిన దుర్ఘటన గురించి చర్చించటానికి ప్రసి ద్ధులయిన వారు వచ్చి ఉన్నారు మన స్టూడియోకి. గాడిదల విషయంలో వారి అనుభవాలను గురించి విందాం. మీరు చెప్పండి వెంకటశివం గారూ! మీరు తెలుగు సాహిత్యాన్ని ఔపోసన పట్టినవారు. తెలుగు సాహిత్యంలో గార్దభ ప్రస్తావన ఉన్న దాఖ లాలేమన్నా ఉన్నాయా?''

''సాహిత్యంలో గార్దభ ప్రస్తావన లేక పోవటమే మిటి? చిలకమర్తి లక్ష్మీ నరశింహం పంతులుగారు తన నవల 'గణపతి'లో తన నాయకుడిని గాడిద నెక్కించారు. తమ నాయకులను గుర్రాలపై, ఏను గులపై ఎక్కించిన కవులు, రచయితలూ ఉన్నారు కానీ గాడిదను ఎక్కించిన ఘనత చిలకమర్తికే దక్కుతుంది. గాడిదంటే చిన్నచూపున్న జనాలను నోరుమూయించేట్టు గణపతి ఆర్యుమెంట్ ప్రెజంట్ చేశాడు. అతను ఏమన్నాడంటే...'' అని పుస్తకం తెరచి అతను చదవసాగాడు.

'' 'పనికిమాలినదని పదిమంది పేరు పెట్టినచో అది పనికి మాలినదె యగును. గాడిద నెక్కుట వలన గొప్ప లాభ మున్నది. అది యేది యనగా, ముందు గాడిద మీద స్వారీ నేర్చుకున్న పక్షమున గుఱ్ఱపు స్వారి సులభమగును. ఇవియన్నియు నటుండనిండు. గాడిద యెంత గొప్పదో మీరెరుగు దురా? శ్రీకృష్ణమూర్తి వారి తండ్రియైన వసుదేవు డంతటివాడు తన కాపద వచ్చినప్పుడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడు. ఏనుగు కాళ్ళు పట్టుకు న్నాడా? గోవు కాళ్ళు పట్టుకున్నాడా? గుఱ్ఱము కాళ్ళు పట్టుకున్నాడా? ఆ మహాపత్సమయమున వసుదేవుడు దాని కాళ్ళు పట్టక పోయిన పక్షమున కృష్ణమూర్తి బతుకకనే పోవును...' ఆ తర్వాత మరో చోట...'' అని ఆ పుస్తకం అటూ ఇటూ తిప్పి, ''ఇంగ్లీషు సాహిత్యంలోనూ మనం జంతువుల పట్ల దయగా ప్రవర్తించాలని చెప్పారు. 'ఎవరేమయినా చెప్పండి, నా మనసులో ఆ దృశ్యం చెరిగిపోదు. చెవులు కత్తిరించిన కుక్కలు, రొప్పుతున్న బండి గుర్రాలు, నీడలేని ఆలోచనలేని ఈగలు, మనిషి క్రూర కర్మకు దయ్యాల్లా మారిన ఆ జంతువుల ఊరేగింపు సాగినంత వరకు. ఆ పశులకాపరి జీసస్ వారి వెంటనంటి వుంటే, మీరెందుకు క్రూరత్వం చూపిస్తారు' అంటాడు జోన్ సిల్కిన్. 'అటెండ్ టు ది అన్నెసరీ బీస్ట్స్' అనీ అంటాడు ఆపైన...''

''ఒక్కక్షణం. నేను మళ్ళా మీదగ్గరకు వస్తాను. ఈ విషయంలో ప్రఖ్యాత సంఘసేవకుడు వాసు దేవరావుగారు ఏమంటారు? ప్రస్తుతం మనం గాడి దల పట్ల సరిగ్గా ప్రవర్తిస్తున్నామంటారా?'' అని ఆంకర్ ప్రశ్నించాడు.

''మన దౌర్భాగ్యమేమిటంటే మనకు పశుపక్ష్యా దుల పట్ల నిర్లక్ష్యం. మన మెంతో నేర్చుకోవల్సి ఉంది. ఇ.వి.లూకాస్ 'స్కూల్ ఫర్ సింపతీ' అన్న చక్కటి వ్యాసంలో చెప్పాడు, మనం పిల్లలకు సాను భూతి చూపటం నేర్పాలని. అదేం పెద్ద కష్టం కాదు. స్కూల్లో ఇవాళ గుడ్డి రోజు, రేపు చెవిటి రోజు, మర్నాడు మూగ రోజు, ఆ తరవాత కుంటి రోజు ఇలా వుంటాయి. ఆ రోజు పిల్లలు ఆయా అంగాలను ఉపయోగించరు. అందువల్ల వికలాం గులు భరించాల్సిన కష్టం గురించి తెల్సుకుంటారు, వాళ్ళ పట్ల ఎలా ప్రవర్తించాలో నేర్చుకుంటారు. అలాంటి ప్రయత్నాలు మనం చేయక పోబట్టే మన సమాజం ఇంత స్పందనా రహితంగా ఉంటోంది...''

''మూగ జీవుల పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో చెప్పండి...'' అడిగాడు ఆంకర్ కొంత అసహనం వ్యక్త పరుస్తూ. తాము పిలచే ఎక్స్ పర్టులు తలాతోకా లేకండా మాట్లాడుతుంటారు. అది చూసి ఒకోసారి వారూ సహనం కోల్పోటం సహజమే.

''వస్తున్నా. అలాగే మనం ఒక కుక్క రోజు, గాడిద రోజు, కోతి రోజు, పిల్లి రోజు, ఎలుక రోజు ఇలా నిర్వహించు కోవాలి. అప్పుడు మనకు మూగ జీవుల బాధలు అవగతమవుతాయి. సెప్టెంబరు 2, 2009 నాటి పేపర్లో చదివిన వార్త నాకు కొంత ఉప శమన కలిగించింది. రాష్ట్రంలో తొలిసారిగా విజయ నగరం జిల్లాలో పాడిపశువులకు 108 తరహాలో వైద్య సేవలు అందించేందుకు మొబైల్ వ్యాను అందుబాటులోకి తెస్తున్నారట. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు కూడా కేటాయిస్తారట! మొబైల్ వ్యానులో ముగ్గురు వైద్య నిపుణులు ఒక ఫిజిష యన్, గైనకాలజిష్టు, సర్జను ఉంటారట! ఇది మాత్రమే చాలదు. ఈ సదుపాయాన్ని పాడిపశువు లకే కాదు మిగతా మూగజీవులకు కూడా ఎక్స్ టెండ్ చెయ్యాల్సిన అవసరం ఉంది.''

''ఇప్పుడు మనమో బ్రేక్ తీసుకుందాం'' అన ఆంకర్ అనటంతో, మళ్ళా అడ్వర్‌టైజుమెంట్ల హోరు విన్పించింది.

ప్రసారం ప్రారంభమయాక, మరో శాల్తీ కన్పిం చింది స్క్రీను మీద. అతడు సుప్రసిద్ధ వెటర్నరీ డాక్టరు మనోజ్ గారని పరిచయం చేసాడు శంకర్. ఆయన తన అనుభవాలని టివి ప్రేక్షకులతో పంచు కోసాగాడు.

''నేను గాడిద కాలు విరగలేదనే అనుకుంటు న్నాను. ఈ జంతువును లాటిన్‌లో ఏక్వస్ ఎసినస్ అంటారు. దాన్నేమని నిర్వచిస్తారో తెల్సా? 'ఎ లాంగ్ ఇయర్డ్, ష్యూర్ ఫుటెడ్, డొమెస్టికేటెడ్ ఏని మల్' అని. స్కూటరు వాడు కొట్టిన దెబ్బకు అది దిమ్మదిరిగి పడిపోయి ఉంటుంది. అసినైనాలజీలో దాన్ని కాస్తంత బద్ధకపు జీవిగా అభివర్ణించారు. ఎంతో నిబ్బరం ఉన్న జంతువు. దేనికీ హడావుడి పడదు. నిబ్బరంగా, నింపాదిగా పనులు చేసుకునే మనుషులకు హార్టుకు సంబంధించిన కంప్లయింటు లేమీ ఉండక పోవటం మనం చూస్తూనే ఉంటాం. దీన్నే ఎసినో-ఫార్టిట్యూడ్ అంటారు. కనుక, మనం గాడిదేకదా అని చిన్న చూపు చూడకుండా దాని నుండీ ఎన్నో మంచి లక్షణాలను అలవర్చుకోవల్సి ఉంటుంది. దౌర్భాగ్యమేమంటే, జంతువులన్నింటికీ కలిపి ఒక వెటర్నరీ ఆసుపత్రిని పెట్టి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. మనుషులలా అంగానికో ఆసుపత్రి కాకపోయినా, కనీసం జంతువుకో ఆసుప త్రయినా ఉండాలి'' అని చెప్పాడు జంతు వైద్యుడు.

## కృతజ్ఞతలు



సి.సి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లీ కథల పోటీ సందర్భంగా నా రచన 'మనోడు' కథకు ప్రత్యేక బహుమతి నిచ్చినందుకు కృతజ్ఞతలు.

క్లుప్తంగా నా గురించిన వివరాలు:

పుట్టింది - గుంటూరు జిల్లా చినకాకాని గ్రామంలో, 26-04-1942 న.

చదువు- ఇంగ్లీషు, ప్రాచీన భారతదేశ చరిత్ర-సంస్కృతి పురావస్తుశాస్త్రంలలో ఎం.ఎలు; తెలుగు కల్పనాసాహిత్యం పై, ఆంగ్ల రచయిత సోమర్‌సెట్ మామ్ ప్రభావం' అన్న అంశం పై పిహెచ్.డి. పట్టా.

ఉద్యోగం - సుమారు ముప్ఫయ్యేళ్ళపాటు ఆంగ్లోపన్యాసకుడిగా పని చేసి, ఏప్రిల్ 2000లో పదవీ విరమణ.

రచనలు- మూడు కథాసంపుటాలు, పన్నెండు నవలలు ప్రచురితమయ్యాయి.

అనువాదాలు- ఆంగ్లం నుండి తెలుగులోకి ఎన్నో; రాజశేఖర చరిత్రము, మైదానం, చివరకు మిగిలేది, అల్పజీవి నవలలను ఆంగ్లంలోకి అనువదిస్తే, ద్రావిడ విశ్వవిద్యాలయం వాటిని ఫోర్ క్లాసిక్స్ ఆఫ్ తెలుగు ఫిక్షన్ పేరిట ప్రచురించింది.

**-కాకాని చక్రపాణి**

**90006 11409**

''గాడిద ఏక్సిడెంటు గురించి మన వ్యూయర్స్ ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారు. వారి ప్రశ్నలకు మన నిపుణులు సమాధానం ఇచ్చే ముందు ఒక సారి తాజాగా అక్కడ గాడిద పరిస్థితి ఎలావుందో తెలుసుకుందాం... హలో తలోదరీ! తాజాగా గాడిద పరిస్థితి ఎలా వుందో చెప్పండి'' అని అడిగాడు ఆంకర్.

టివి రామనగర్ ప్రాంతాలను చూపించింది. రెండు క్షణాలు దిక్కులు చూసిన తలదోరి, ''బాలాజీ! ఎవరూ ఊహించని సంఘటన జరిగింది. పది నిమిషాలదాకా కాలు విరిగి పడిపోయి ఉన్న గాడిద ఇంతకు ముందే లేచి కూర్చుంది. బద్ధకంగా ఆవలించి, లేచి తన దోవ పట్టింది. దాన్ని ఆసుపత్రికి తీసుకు వెళ్దామన్న ఆత్రుతతో ఆప ప్రయత్నించిన మన కెమేరామన్‌ని నడ్డి విరిగేట్టు తన్నింది. ఇప్పుడతన్ని ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలి. ఇప్పుడీ వ్యూ కూడా అతను చాలా కష్టం మీద కెమేరాలో బంధిస్తున్నాడు. ఎంత కష్టంలో కూడా మన స్థయిర్యం కోల్పోకూడదని గాడిదను చూసి అతను నేర్చుకున్నట్టున్నాడు... ఆ, మీరు పంపిన రెస్క్యూ వాన్‌లో మన కెమేరామన్‌ను ఆసుపత్రికి పంపిస్తున్నాను. దిసీజ్ తలదోరి రిపోర్టింగ్ ఫ్రం రామ్‌నగర్ విత్‌వర్ ఇంజూర్డ్ కెమేరామన్ రఘురాం.'' అంది.

''ఎక్కడికీ, పశువుల ఆసుపత్రికా?'' అని సంఘ సేవకుడు వాసుదేవరావు ప్రశ్నించాడు కానీ ఆంకర్ బ్రేక్ ప్రకటించటంతో అడ్వర్టయిజ్‌మెంట్ల హోరు మొదలయింది. అలా సాగింది ఆ గాడిద ఎపిసోడ్. ఆ స్టోరీని మళ్ళామళ్ళా టెలికాస్ట్ చేసింది ప్రజాటివి. ఆరోజంతా గాడిద గోలే. దాన్ని అంత గొప్పగా నిర్వహించినందుకుగాను తలోదరి కెంతో ప్రశంస లభించింది. నారాయణ మాత్రం చెడామడా తిట్టాడు.

ఈ సంఘటన జరిగిన నెల రోజుల తర్వాత, ''మొన్న మీ కాండిటేట్ గాడిద స్టోరీ బాగా పండింది'' అన్నాడు బలవంతరావు, నారాయణను చూసి ఇకిలిస్తూ. అది ఎకసెక్కమో, నిజమో తేల్చుకోలేక పోయాడు నారాయణ. ఆ ఎపిసోడ్ చూసిన పుటినుండి నారాయణ సిగ్గుతో చితికి పోయాడు. మిత్రులనుండీ అతనికి ఫోన్లుకూడా వచ్చాయి, టివి ఛానెల్‌ని భ్రష్టుపట్టిస్తున్నావంటూ.

ఆ సమయంలో సిఈవో కమలాకర్ లోపలికి వచ్చాడు. అతడు పెద్ద బిజినెస్‌మాన్. రాజకీయంగా మద్దతు సంపాదించుకోటానికే అతనీ టివి ఛానల్ పెట్టాడు. అతనికి మరెన్నో బిజినెస్‌లు ఉన్నాయి.

అతన్ని అడిగాడు బలవంతరావు ''గాడిద స్టోరీ ఎలా వుంద''ని.

''విన్నాను, చూడలేదు. మన నారాయణ గారే చెప్పారు, చెత్త ఎపిసోడ్ అని'' అన్నాడు సిఈవో.

''నో, ఐ డోంట్ అగ్రీ విత్ఇట్. ఆ రోజు మనకసలు న్యూసే లేదు. టైమ్‌లీగా ఈ పిల్ల ఏక్ట్ చెయ్యటం వల్ల మనకిబ్బంది లేకుండా పోయింది. కానీ, నన్నెంత ఇబ్బంది పెట్టిందనుకున్నారు. గాడిదను గుర్చి మాట్లాడటానికి నిపుణులను చూడండని నారాయణగారితో అంటే ఆయన పట్టనట్టు ఉండిపోయాడు. మరి నాకు తప్పలేదు, ఆ షార్ట్ టైములో వాళ్ళని వెతికి పట్టుకు రాక. దట్ గాళ్ ఈజ్ రిసోర్స్‌ఫుల్. షి డిజర్వ్స్ ఆల్ ప్రయిజ్! మన క్వావల్సినట్టు మాట్లాడించటానికి ఆమె మొగుణ్ణే పెట్టి మాట్లాడించటం అద్భుతం! వాడు వెంకట రమణ మఫ్ అనుకున్నాను కానీ, వాడూ అంత ఇన్‌వెంటివ్ అనుకోలేదు. చాకుక్యులు గాడిదల కోసం రాజవీధుల ప్రక్కన మంచి నీటి తొట్టిలు కట్టించారని, గాడిదలకు ప్రత్యేక దవాఖానాలు ఉండేవంటూ గొప్పగా చెప్పాడు. అబద్ధమైతేనేం, సమయ స్ఫూర్తి చూపించాడు. ఈ ప్రయోగం వల్ల నాకో కొత్త ఆలోచన కూడా కలిగింది. ఐ విట్‌నెస్‌ల కోసం చూడకుండా మనమే కొంతమందిని ఆ అమ్మాయి వెంకట రమణను ప్లాంట్ చేసినట్టు చేయవచ్చు కదా! అప్పుడు స్టోరీని మనమనుకున్న విధంగా నడిపించవచ్చు.''

''దటీజ్ హుడ్‌వింకింగ్ ద వ్యూయర్‌షిప్ అండ్ ఏన్ అనెథికల్ ప్రాక్టీస్ ఏజ్ వెల్'' అన్నాడు నారాయణ.

''ఏందండీ, అనెథికల్, మనది బిజినెస్ అండీ. మడికట్టుకు కూర్చుంటామంటే కుదరదు. పోటీ ప్రపంచంలో పైకి రావాలంటే మనం నీతీ- నిజాయితీ అని చేతులు కట్టుకుండలేం'' అన్నాడు బలవంతరావు.

''పెద్దాయన కదా! తేలిగ్గా మారలేరు నారాయణగారు. ఆయనింక రిటైరవటం మంచిదేమో'' అని నవ్వుతూ లేచి వెళ్ళిపోయాడు సిఈవో.

గాలి ఎటువీస్తోందో అర్థమైపోయింది నారాయణకి. మొదట్లో అతను తన్ను చాలా గౌరవంగా చూసేవాడు. ఇప్పుడతని మొగ్గంతా బలవంతరావు పక్షానే ఉంది. అతనిది గమనించక పోలేదు.

అతను యథాలాపంగా అన్నట్టు అన్నాడు కానీ, నారాయణకు తెల్సు- తనకింక అక్కడ ఉద్వాసన పలికినట్టేనని. తనింక మర్యాదగా తప్పుకోవటం మంచిది. తను, బలవంతరావుల మధ్య పోటీ ఎప్పటినుండో కొనసాగుతున్నది. ప్రింట్ మీడియాలో ఉన్నప్పుడే తమిద్దరికీ పడేది కాదు. ఆ శత్రుత్వం తన్ను ఉద్యోగంలోనుండి పీకించేంత కంఠదఘ్నంగా ఉందని తను ఊహించలేదు.

బలవంతరావుకి సంతోషంగావుంది.

''వాడు వెంకటరమణ వచ్చి నా కాళ్ళమీద పడ్డాడు. ఆ గాడిద ఎపిసోడ్ చేసినందుకు మీరు వాళ్ళని తిట్టారంటగా? ఆ దంపతుల్ని బర్తరఫ్ చెయ్యాలనికూడ సిఈవోకు రికమెండ్ చేశారంట! నౌకరీ కాపాడే భారం నాదేనన్నాడు. పోన్లే, మనోడిని మనం కాపాడక పోతే ఎట్లానని వాడికి భరవాసా ఇచ్చినా'' అన్నాడు వంకర నవ్వు నవ్వుతూ బలవంతరావు.

ఏం మాట్లాడకుండా తన ఛేంబర్‌లోకి వెళ్ళి, రిజిగ్నేషన్ లెటర్ రాసి సిఈవో దగ్గరికి వెళ్తూ, 'తనకూ, బలవంతరావుకూ కులాభిమానం ఉంది కానీ, ఆ పేరు చెప్పి పబ్బం గడుపుకునే వెంకట రమణకు కులం, గోత్రం లేవు. అతడందరికీ 'మనోడ'వగలిగిన సత్తా కలిగినవాడు' అనుకున్నాడు నారాయణ.

సిఈవో, ''నేనేదో మాటవరుసకన్నాను, మీరు సీరియస్‌గా తీసుకున్నారా ఏమిటి?'' అన్నాడు నొచ్చుకుంటున్నట్టు.

''లేదు లెండి. నేనూ ఎప్పటినుండో మానేద్దామనుకుంటున్నాను'' అని అతనికి నచ్చ చెప్పి బయటకు వస్తూంటే కెమేరామన్. రఘురాం కన్పించాడు.

గాడిద తన్నినప్పుడు అతని ముందు పళ్లు రెండు విరిగాయి.

''ఎట్లున్నవయ్యా!'' అని ప్రశ్నించాడు నారాయణ.

''ఏదో ఇట్లున్నా, జాలి పడి గాడిదలకు సాయం చేయకూడదని మాత్రం అర్థం చేసుకున్నా, సార్!'' అన్నాడతను.

